# మరొకడు

కె.వి.యస్.వర్మ

"ఏంటీ"

"....."

"మావాడికి పిచ్చా"

"....."

"అలాగే. వెంటనే బయల్దేరి వస్తున్నా"

"ఏంటండీ, ఫోన్ చేసిందెవరు"

"మనవాడి కాలేజీవాళ్లు..."

"ఎందుకు"

"ఓసారి వచ్చి వెళ్లమన్నారు"

"ఏ అఘాయిత్యమూ చేయలేదుకదా" అంది జానకి ఆందోళనగా.

"అబ్బే, అలాంటిదేమీలేదు కానీ..." అంటూ ఆగాడు పురుషోత్తమరావు ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటూ.

"ఏం జరిగిందో చెప్పండి"

"మనవాడి కారణంగా వాళ్ల లాబ్ పాడయిందట. వెంటనే రమ్మన్నారు" అని ముక్తసరిగా చెప్పి, ఓ జత బట్టలూ టూత్‌పేస్టూ వగైరా సూట్‌కేసులో పెట్టాడు.

బీరువాలోంచి డబ్బు తీసుకుని, పర్సులో పెట్టుకున్నాడు. గబగబా లుంగీవిప్పి, బట్టలేసుకుని, "అక్కడికెళ్లాక ఫోన్ చేస్తాను" అంటూ బయటికెళ్లిపోయాడు పురుషోత్తమరావు.

అయోమయంగా వీధిలోకి చూస్తూ ఇంటి గడపదగ్గర నిలుచుండిపోయింది జానకి.

** ** **

రైల్లో కిటికీ పక్క సీట్లో కూర్చుని బయటకు చూస్తున్నాడు పురుషోత్తమరావు.

మసకమసక చీకటి. తనకళ్లే మసకమసగ్గా ఉన్నాయేమోననుకుని కళ్లు మూసుకుని, చేత్తో నులుముకుని, తెరిచి, బయటకు చూశాడు.

అదే చీకటి.

"ఎందుకిలా జరుగుతోంది? సుమంత్ ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు? వాడిమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాం. డాక్టరవ్వాలనీ, ఏ అమెరికానో వెళ్లి బాగా సంపాదిస్తే చూసి ఆనందించాలనీ... వాడికేం తక్కువ చేశాను? డబ్బుకోసం వాడు ఇబ్బందిపడకూడదని తనెంత తాపత్రయపడుతున్నాడు! మంచిపేరున్న రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించాను కదా. చక్కగా చదువుకోవాల్సిందిపోయి, అలాగెందుకు చేశాడు! 'మీవాడికి పిచ్చెక్కింది' అంటాడేమిటి కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఇందాక ఫోన్‌లో.

లాబరేటరీని పాడుచేశాడంటాడేమిటి ఆయన!

ఎవరివల్లో ఏదో అయితే, డబ్బులు గుంజడానికి సుమంత్ మీద పెట్టలేదుకదా! అలా చేసుంటే, పిచ్చెక్కిందని చెప్పడుకదా ఆయన.

అక్కడికెళ్లేలోగా తనకు పిచ్చెక్కేలాగుంది...."

"కాఫీ టీ, కాఫీ టీ" కేక విని, పురుషోత్తమరావు కళ్లు తెరిచి,

"టీ ఇవ్వు" అన్నాడు.

డబ్బులిచ్చి, టీ తాగుతూ చుట్టూ చూశాడు.

ఎవరి కాలక్షేపంలో వాళ్లున్నారు.

పురుషోత్తమరావు టీ తాగి, డిస్పోజబుల్ గ్లాసును చేత్తో నొక్కి, కిటికీలోంచి బయటకు పారేశాడు.



సిగరెట్ కాలుద్దామనుకున్నాడు. రైలుపెట్టెలో ఎవరూ కాల్చడంలేదు. సీట్లోంచిలేచి, టాయ్‌లెట్ వరకూ వెళ్లి, సిగరెట్ వెలిగించుకుని గట్టిగా దమ్ములాగాడు. ఏదో హాయిగా అనిపించింది. ఆ వెంటనే, సుమంత్ విషయం గుర్తొచ్చి చేదుగా అనిపించింది.

మరో దమ్ములాగి, సిగరెట్ కిందపడేసి, జోడుతో గట్టిగా నొక్కి, తిరిగి తన సీటు దగ్గరకొచ్చి కూర్చున్నాడు.

"ఎక్కడో దూరంగా హాస్టల్లో ఉంటూ చదవక తప్పదా డాడీ" అన్నాడు ఓసారి సుమంత్.

"అది మంచి పేరున్న కాలేజీరా. అక్కడ ఇంటర్ ఎంసెట్ లాంగ్‌టెర్మ్ కోచింగ్ తీసుకోవచ్చు" అని బలవంతంగా చేర్పించాడు తను.

"మమ్మీ, మీ దగ్గరే ఉండి చదువుకుంటానే" అనీ బతిమాలాడు.

జానకి కూడా తనలాగే నచ్చజెప్పింది.

సుమంత్ ముఖం మాడ్చుకునే ఆకాలేజీలో చేరాడు.

ఇంటర్ ఫస్టియర్‌లో మార్కులు బాగా రాలేదు. ఆ సంగతి కాలేజీ కరస్పాండెంట్ తనకు ఫోన్‌చేసి చెప్పాడు.

"మా అబ్బాయిని మీ చేతుల్లో పెట్టాను. వాడి బాగోగులు చూడాల్సింది మీరే. బాగా చదవమని నేను చెబుతాను. మీ పద్ధతిలో మీరూ చెప్పండి" అన్నాడు తను.

తర్వాత నాలుగయిదు రోజులకు సుమంత్ ఫోన్ చేశాడు.

"డాడీ, నేనిక్కడ చదవను"

"ఏవయ్యింది? బోలెడంత ఫీజుకట్టి అంత పెద్ద కాలేజీలో చదివిస్తూంటే నీకేం పోయేకాలం వచ్చింది. వేషాలెయ్యక బుద్ధిగా చదువుకో"

"మీరుకానీ అమ్మకానీ ఎప్పుడూ మా కరస్పాండెంట్‌లాగ మాట్లాడలేదు..."

"ఏమన్నాడేంటీ"

"ఏంటిరా, ఈ మార్కులేంటిరా! సక్కగా సదూకోమని మీ పేరెంటోళ్లు ఏలకుఏల పీజులుకట్టి పంపితే ఏంచేస్తన్నవురా! పొద్దుటేల టిపినీ, మద్దినాల పుల్‌మీల్సూ, చికెనూ మటనూతో రాత్రేల పుల్‌మీల్సూ దొబ్బితినేసి, తొంగుంటున్నావా! ఇక నుంచైనా సరీగ్గా సదవకపోయావో, ఇదే రూంలో తలుపులేసేసి సితకతన్నేగల్ను జాగర్త అంటూ వార్నింగ్ ఇచ్చేడు డాడీ. నేను నీకు చెప్పడానికి సిగ్గుపడేలా బూతులు కూడా మాట్లాడాడు. మేం కోట్లకు కోట్లు పెట్టుబడి పెట్టి ఈ కాలేజీని ఎందుకు నడుపుతున్నాం? మీలాంటోళ్లకోసం. నీకు టెన్త్‌లో మార్కులు బాగావచ్చాయి కాబట్టి నీకు సీటిచ్చాం. నువ్విలాగే సదివి మిగతావోల్లా రేంకులు తెచ్చుకోనేదనుకో. మేం మా కాలేజీకి తాళం ఏసుకోవాల. ఇంత కతున్నాది ఈ రేంకుల ఎనకాల అనీ అన్నాడు డాడీ"

"అంతా నీ మంచికే కదరా"

"నేనేం చెప్పినా నువ్వు అర్థం చేసుకోవడంలేదు డాడీ"

"నువ్వు బాగా చదువుతూంటే మీ కరస్పాండెంట్ అలా అనేవాడు కాదుకదా. అంచేత ఆయన మళ్లీ అలాంటి మాటలు అనే అవకాశం ఇవ్వకుండా బాగా చదివి, మంచి ర్యాంకు తెచ్చుకో" అని తను ఫోన్ పెట్టేశాడు.

తర్వాత సుమంత్ తనకు తానుగా ఫోన్ చెయ్యడం మానేశాడు. తనే ఎప్పుడన్నా ఫోన్‌చేస్తే ఆఁఊఁ అంటూ ముక్తసరిగా మాట్లాడుతున్నాడు. చదువులో బిజీగా ఉండడంవల్ల వాడలా ఉంటున్నాడని తను అనుకున్నాడు. అప్పటినుంచే వాడి బుర్రపాడయి వుంటుందా?

సుమంత్‌ను మళ్లీ మామూలు మనిషిని చెయ్యడానికి ఎంతకాలం పడుతుందో, ఎంత ఖర్చవుతుందో" పురుషోత్తమరావు అలా ఆలోచిస్తూనే ఉన్నాడు.

** ** **

పురుషోత్తమరావు రైలుదిగి, ఆటో ఎక్కి రెసిడెన్షియల్ కాలేజీకి దగ్గరలో ఉన్న ఓ హోటల్‌లో రూము తీసుకున్నాడు. కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి, ఆరోజు పేపర్ తీసుకున్నాడు చదువుదామని. అక్షరాలు బుర్రకెక్కడంలేదు.

అతనికి నిమిషాలు గంటల్లా గడుస్తున్నాయి.

అస్తమానం వాచీ చూస్తున్నాడు.

గది కిటికీలోంచి శీతలగాలి వస్తున్నా పురుషోత్తమరావుకు ఉక్కగా ఉంది.

ఎప్పుడు కాలేజీకెళ్లి సుమంత్‌ను చూద్దామా అని ఉంది.

పురుషోత్తమరావు మళ్లీ వాచీ చూశాడు. ఎనిమిదిన్నర.

సిగరెట్ వెలిగించి కాసేపు అటూఇటూ పచార్లు చేశాడు. రూమ్‌బాయ్‌ను పిలిచి మరోసారి టీ తెప్పించుకున్నాడుకానీ తాగబుద్ధి కాలేదు.

బట్టలు వేసుకుని, రూముకు తాళంవేసి, రెసిడెన్షియల్ కాలేజీకెళ్లాడు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దగ్గరకెళ్లి,

"నమస్తే" అని పలకరించి, తన పేరు చెప్పాడు.

అంతవరకూ ప్రశాంతంగా ఉన్న ఆఫీసర్ ముఖం చిటపటలాడిపోయింది.

"రండి. మా లాబరేటరీని మీవాడు ఎంతగా పాడుచేశాడో చూద్దురుగాని

"చూద్దాంలెండి, ముందు సుమంత్‌ను పిలిపించండి"

"పిలిపిస్తాను. ముందు లాబ్‌కెళ్దాంరండి" అన్నాడు ఆఫీసర్ కుర్చీలోంచి లేచి నిలబడి.

పురుషోత్తమరావుకు చాలా కోపం వచ్చింది.

"కొడుకెలావున్నాడో చూద్దామని నేను ఆదుర్దాగా ఉంటే, వీడు లాబ్‌లాబ్ అంటాడేమిటి? వీళ్లకు మనుషులకంటే లాబ్‌లూ డబ్బులే ముఖ్యంలావుంది" అని మనసులోనే తిట్టుకుంటూ పురుషోత్తమరావు అతని వెంట నడిచాడు.

ఆ లాబ్ తలుపు తెరిపించి, "చూడండి, మీవాడి ఘనకార్యం. ఎంత పిచ్చి ఎక్కకపోతే ఇంతిలా ధ్వంసం చేస్తాడు" అన్నాడు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్.

పురుషోత్తమరావు చూశాడు. ఆ గదినిండా టెస్ట్‌ట్యూబ్, యాపరేటస్ వంటి పరికరాలు పగిలిపోయి, గాజుపెంకులు చెల్లాచెదురుగా వున్నాయి. కుర్చీలు కొన్ని విరిగిపోయి ఉన్నాయి.

"ఇనపరాడ్‌తో వీటినన్నిటినీ పగలకొట్టాడట మీ వాడు. ఓ ముప్పైవేలకు పైగానే నష్టం జరిగింది...'

"సరే. ఇంక మా అబ్బాయిని చూడనివ్వండి..."

"చూద్దురుగాని, ముందు ఈ నష్టం సంగతి చూడండి"

"ఏం చెయ్యమంటారు"

"ఆ డబ్బు కట్టేసి..."

"ఇప్పుడెలాగూ మావాడిని మా వూరు తీసుకెళ్లిపోతాగా. నేను కట్టిన ఫీజు సొమ్ముందిగా, అందులో మినహాయించుకుందురుగానీ, ముందు మావాడిని..."

"అలాగే, నడవండి...."

పురుషోత్తమరావు అతని కూడా వెళ్లాడు. ఓ గది కిటికీలోంచి చూడమన్నాడు.

సుమంత్ కళ్లు మూసుకుని ఓ కుర్చీలో కూర్చున్నాడు. కొద్దిగా మాసిన గడ్డం.


"తలుపు తియ్యండి"

"భలేవారే. తన్నినా తన్నగలడు. మెంటల్ హాస్పటల్‌కు ఫోన్‌చేస్తే వాళ్లే చూసుకుంటారు..."

"ఫర్వాలేదు, తియ్యండి. లోపలికి నేను ఒక్కణ్నే వెళ్తానులెండి..." అన్నాడు పురుషోత్తమరావు వచ్చే కోపాన్ని నిగ్రహించుకుంటూ.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తలుపు తియ్యమని అటెండెంట్‌కు చెప్పి కిందకెళ్లిపోయాడు.

పురుషోత్తమరావు గదిలోకెళ్లాడు.



'సుమంత్' అని పిలిచాడు.

సుమంత్ కళ్లు తెరిచి రెప్ప వెయ్యకుండా తండ్రివంక చూశాడు.

పురుషోత్తమరావుకు భయం కలిగింది. ఆ కళ్ల తీక్షణతను చూడలేక కళ్లు దించుకున్నాడు.

"ఏంటిరా ఇదంతా"

"ఏదంతా ఈంటిరా" అంటూ సుమంత్ పగలబడి నవ్వాడు.

"ఏడుకొండలవాడా, వెంకట రమణా, మా సుమంత్ ఆరోగ్యం బాగుచెయ్యి తండ్రీ. నీకొండకొచ్చి తలనీలాలు ఇస్తాను"అంటూ హాల్లో గోడకు తగిలించిన తిరుమలేశుని ఫొటోకు రెండు చేతులూ జోడించి ప్రార్థించింది జానకి కన్నీళ్లు కారుస్తూ.

ఆ నవ్వు ఉవ్వెత్తున లేచే సముద్రకెరటాల్లా తనను ముంచేస్తుందేమోననుకుంటూ పురుషోత్తమరావు ఒకడుగు వెనక్కువేశాడు.

అంతలోనే సుమంత్ తనకేం పట్టనట్టు కళ్లు మూసుకున్నాడు.

"సుమంత్, మనవూరు పోదాం తయారవ్వు"

"ఏవూరు? ఎవరు నువ్వు?"

కొడుకు అలా అనగానే పురుషోత్తమరావుకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

సుమంత్ దగ్గరికెళ్లి తల నిమిరాడు. తండ్రి చేతిని విసురుగా తోసేశాడు సుమంత్.

ఒక్కక్షణం పురుషోత్తమరావుకు ఏమీ పాలుపోలేదు.

"రామ్మా వెళ్దాం" అంటూ పురుషోత్తమరావు కొడుకు చెయ్యి పట్టుకుని లేవదీశాడు.

సుమంత్ లేచి నిలబడ్డాడు.

గబగబా దండెంమీద వున్న బట్టల్ని సూటుకేసులో సర్ది, సుమంత్‌ను తీసుకుని కిందకు వచ్చాడు.

"వివరంగా తర్వాత అన్నీ మాట్లాడదాం. మా వాణ్ని తీసుకుపోతున్నా" అని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో చెప్పి, హొటల్‌కెళ్లి, రూము ఖాళీచేసి రైల్వేస్టేషన్‌కు కొడుకుతో బయల్దేరాడు పురుషోత్తమరావు.

** ** **

"ఏవయ్యిందండీ"

"ఏవయ్యిందండీ" అని తల్లిని ఇమిటేట్ చేస్తూ ఆమెలానే చెయ్యి ఊపాడు సుమంత్.

"ఇదేంటండీ'

"ఇది అదేనటండీ"

"ఏం చెప్పను జానకీ, మన ఖర్మ"

"ఏం జరిగిందండీ"

"మనవాడికి కాస్త మైండ్ పాడయ్యింది"

'అయ్యో. నిక్షేపలంలాంటి కుర్రాడు. మైండ్ పాడవడం ఏంటండీ"

"ముందు మంచి సైకియాట్రిస్టును కలవాలి. వాడిని మళ్లీ మామూలు మనిషిని చెయ్యాలి" అంటూ పురుషోత్తమరావు కుర్చీలో కూలబడ్డాడు.

"ఏడుకొండలవాడా, వెంకట రమణా, మా సుమంత్ ఆరోగ్యం బాగు చెయ్యి తండ్రీ. నీ కొండకొచ్చి తలనీలాలు ఇస్తాను "అంటూ హాల్లో గోడకు తగిలించిన తిరుమలేశుని ఫొటోకు రెండు చేతులూ జోడించి ప్రార్థించింది జానకి కన్నీళ్లు కారుస్తూ.

సుమంత్ బెడ్‌రూములోకెళ్లి కిటికీలోంచి బయటకు చూశాడు.

అలసిపోయిన సూరీడు కందిన ముఖంతో పడమటి కొండల్లోకి విశ్రాంతి తీసుకుందామని వెళ్తున్నాడు.

అలా ఆకాశంవైపు చూస్తూ కొంతసేపుండి, హాల్లోకి వచ్చి,

"డాడీ, ఇది చదువు" అంటూ ప్యాంట్ జేబులోంచి ఓ లెటర్ తీసి, తండ్రి చేతిలో పెట్టి మళ్లీ బెడ్‌రూములోకెళ్లి కిటికీ దగ్గర నిలబడ్డాడు సుమంత్.

"ప్రియమైన అమ్మా, నాన్నలకు... అలా రాయకూడదనుకుంటాను. డియర్ మమ్మీ, డాడీ... చిన్నప్పుడు 'అమ్మా' అని పిలుస్తూంటే 'అలా వద్దు, మమ్మీ అని పిలువు అని అమ్మ ,కాదు, మమ్మీ 'మమ్మీ' అని పిలిచేవరకూ ఊరుకోలేదు. అలాగే 'డాడీ 'అని

పిలిచేలా నువ్వు అలవాటు చేశావు.

కాన్వెంటులో చదివేటప్పుడు నేను బొమ్మలేసేవాణ్నికదా. మొదట్లో మీరిద్దరూ మెచ్చుకున్నారు. మా కాన్వెంటులో జరిగిన పెయింటింగ్ కాంపిటేషన్‌లో నేను వేసిన బొమ్మకు ఫస్ట్‌ప్రెయిజ్ వచ్చినప్పుడు ఇంటికొచ్చిన నలుగురికీ చూపించి మురిసిపోయారు.

పచ్చని కొండెక్కి మేస్తున్న తెల్ల గొర్రెల్నీ పైన పరుగెడుతున్న మేఘాల్నీ చూసి, కొండమీద మేఘాల్లా గొర్రెలు పరుగెడుతున్నట్టు వేశానా పెయింటింగ్.

సెవెంత్ క్లాస్ కామన్ ఎగ్జామ్ కావడంతో నన్ను బొమ్మలెయ్యవద్దన్నారు. బొమ్మలు కూడు పెడతాయేంటీ అంటూ రాత్రిపగలూ చదువుకో చదువుకో అంటూ సతాయించారు. టెన్త్‌లో అయితే ట్యూషన్ కూడా పెట్టించి తెగ చదివించారు.

మంచి మార్కులతో పాస్ కావడంతో నువ్వు డాక్టర్ కావాలంటూ బైపిసిలో చేర్పించారు. కప్పల్ని కోయడం, గొంగలి పురుగుల్ని చీల్చడం నాకు ఇష్టంలేదు. అసహ్యంగా కూడా ఉందంటే మిగతావాళ్లు చేయడం లేదా అంటూ నా మాటల్ని కొట్టిపారేశారు.

పచ్చని పచ్చిక మీద గెంతుతూ వెళ్లే కప్పల్ని చూస్తే ఎంతో ఆనందం. నల్లనల్లగా ఉండే గొంగళిపురుగు రంగురంగుల శీతాకోక చిలుకగా మారి, పూలమీద వాలుతూంటే ఎంతో అందం, తన్మయత్వం...

మీకు దూరంగా ఆ రెసిడెన్షియల్ కాలేజీలో చదువుల యంత్రంలా మారడం నాకు నచ్చలేదు. ఎంతో అసంతృప్తి... ఇంకెంతో కసి... నా ఇష్టాల్ని పట్టించుకోని మీమీద, ర్యాంకు రాకపోతే జాగ్రత్త అంటూ బెదిరించే కరస్పాండెంట్ మీద... ఆఖరికి నామీద కూడా... ఏదో ఒకటి చెయ్యాలి. లేకపోతే పిచ్చెక్కిపోతుందనిపించింది.

కొన్ని రెసిడెన్షియల్ కాలేజీల్లో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం పేపర్లలో చూసి, నేనూ చచ్చిపోదామనుకున్నాను. అయితే, అలా ఆత్మహత్యలు చేసుకున్నవాళ్ల తల్లిదండ్రులు కుమిలిపోవడం కూడా పత్రికల్లో చదివాను. నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రులకు జీవితాంతం కడుపుకోత మిగల్చకూడదనుకున్నాను. మీరన్నా, ఈ ప్రపంచం అన్నా, పచ్చని ప్రకృతి అన్నా నాకెంతో ప్రేమ.డాక్టరయితేనే బాగా సంపాదించవచ్చనుకుంటారు మీరు. నాకేమో మంచి ఆర్టిస్టునవుదామని ఆశ. ఫైన్‌ఆర్ట్స్‌లో మాస్టర్ డిగ్రీ తీసుకుందామని నా కోరిక. నా పెయింటింగ్స్‌కు పేరొస్తే, అవీ బాగా అమ్ముడుపోయి బోలెడు డబ్బు రావచ్చు. రాకపోయినా నాకిష్టమైన పని చేస్తూ సాధారణంగా బతకడమూ నాకిష్టమే.

అందుకే మీమీదా నామీదా నా కున్న అపార ప్రేమతో చావకుండా ,మీ అందరి మీదా నాకున్న నా ఆగ్రహాన్ని లాబరేటరీ మీద చూపించాను. పిచ్చెక్కినట్టు నటించాను. ఇంకా నటిద్దామనుకున్నాను కానీ, మీరు పడుతున్న బాధను చూడలేకపోయాను. మిమ్మల్ని ఇలా బాధపెట్టినందుకు క్షమించండి అమ్మా, నాన్నా... అలా అనకూడదనుకుంటాను, సారీ మమ్మీ, సారీ డాడీ...." -సుమంత్.

గట్టిగా ఊపిరి పీల్చుకుని, "జానకీ, మనవాడు రాసింది చదువు" అని పురుషోత్తమరావు భార్య చేతిలో ఉత్తరం పెట్టి, సంతోషం పట్టలేక గబగబా బెడ్‌రూమ్‌లోకి పరుగులాంటి నడకతో వెళ్లి, సుమంత్ భుజంమీద చెయ్యేశాడు వాత్సల్యంగా.

# ఒకేఒక అధిక్షేప కావ్యంతో ప్రసిద్ధుడైన పోప్‌కవి

విశ్వవిఖ్యాత ఆంగ్లకవులలో అలెగ్జాండర్ పోప్‌కు ప్రముఖస్థానం వుంది. పద్దెనిమిదో శతాబ్దంలో (1688-1744) జీవించిన ఈ కవి చాలా చిన్న వయసులో గ్రీక్,లాటిన్, ఫ్రెంచ్,ఇటాలియన్ వంటి భాషల్లో పాండిత్యం సంపాదించారు. ఆయా భాషల్లోని గొప్ప గ్రంథాలను కూలంకషంగా అధ్యయనం చేశారు. విశ్వసాహిత్యంలో తన ముద్రని బలంగా వేసిన వారిలో ఆయన కూడా ఒకరు.

తన కోరికలను అదుపులో పెట్టుకోగలిగిన మనిషి, ఆనందమైన, ప్రశాంతమైన జీవితాన్ని గడిపి ఈలోకం విడిచిపెట్టాలని అంటూ పన్నెండేళ్ళ వయసులో సాలిట్యూడ్ (ఏకాంతవాసం) అనే పద్యాన్ని రాశారు. ఈ పద్యంతో ఆయన సాహిత్య జీవితం మొదలయింది. విశ్వవిఖ్యాత గ్రీకు కవి హోమర్ రాసిన ఇలియడ్ అనే పురాణ కావ్యాన్ని గ్రీకు నుంచి ఇంగ్లీషులోకి అనువదించారాయన.

అలాగే హోమర్ కావ్యం ఒడిస్సీ అయిదు భాగాలను ఇంగ్లీషులో ప్రచురించారు. హోరేస్ అనే ప్రముఖ లాటిన్ కవి- అధిక్షేపకవితలను ఆంగ్లంలో, అనువాద వ్యాఖ్యాలతో ప్రచురించారు. అప్పటికి ప్రముఖ, వ్యంగ్య, హాస్య విమర్శకులుగా ప్రసిద్ధులైన యడిసన్- స్టీవ్‌లు పోప్‌కి మిత్రులు. వారు ప్రచురిస్తున్న 'ది స్పెక్టేటర్' (సాక్షి) పత్రికలో పోప్ కొన్ని వ్యంగ్య విమర్శలతో కూడిన వ్యాసాలు రాశారు. సంఘంలోని లోపాలను, వ్యక్తుల బలహీనతలను, కపటత్వాన్ని, ఆడంబరత్వాన్ని, మోసాన్ని, చతురతను తెగనాడుతూ వ్యంగ్యాస్త్రాల్ని సంధించారు. అలెగ్జాండర్ పోప్‌కి కవిగా మొదటగా మంచి గుర్తింపు తెచ్చిన కవిత 'యాన్ ఎస్సే ఆన్ మాన్'. ఈ కవితలో మనిషి అహంతో విర్రవీగుతూ దైవలీలలు తెలుసుకోడానికి ప్రయత్నించక, తోటి మానవుణ్ణి అర్థం చేసుకోమని సలహా ఇస్తాడు. మనిషి తానొక గొప్ప జ్ఞాని అనుకుంటాడు- కాని అతని అజ్ఞానమేమిటో అతనికే తెలియదు. మనిషి ఒకవైపు నిత్యశంకితుడు- మరోవైపు గొప్ప వేదాంతి. కొన్ని సమయాల్లో తనే సృష్టికర్తననుకుంటాడు. కొన్ని సమయాల్లో తను మూర్ఖుడైన పశువులాంటి వాడనుకుంటాడు. మనిషి అనేక తప్పులు చేస్తాడు. విశ్వ రహస్యాలను ఛేదించగలననుకుంటాడు. అతనికి అతని కథ ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. తన నిరాశానిస్పృహలతో దైవాన్ని నిందిస్తుంటాడు.

ఈ సారాంశం వున్న చిన్న కవితా రచన 1711లో పోప్ రచించి ప్రకటించగా ఇందులోని వ్యంగ్య విమర్శ కవికి మంచి పేరు తెచ్చిపెట్టాయి. ఇక్కడ వింత విషయమేమిటంటే హోమర్ రచనలు ఇంగ్లీషులోకి ఎంతో ప్రతిభావంతంగా అనువదించి పొందిన పేరు ప్రతిష్టలకంటే- 'ది రేప్ ఆఫ్ ది లాక్' అనే అధిక్షేప కావ్యం ద్వారా ఎక్కువ ఖ్యాతి లభించింది. దీనివల్ల అధిక్షేప కావ్య రచయితగా మరింత గొప్ప పేరు వచ్చింది. ఈ పద్యకావ్యాన్ని సుమారు వేయి పంక్తుల్లో పోప్ అయిదు భాగాలుగా రాశారు. అలెగ్జాండర్ పోప్‌కు తెలిసిన రెండు కాథలిక్ కుటుంబాల మధ్య ఒక తగవు ఏర్పడింది. రాబర్ట్ అనే పేరున్న ఇరవై రెండేళ్ళ యువకుడు- కుమారి 'అరబెల్లా' అనే యువతి జడను కత్తిరించాడు. దీనితో ఆ అమ్మాయి ఎంతో మానసిక క్షోభకు, అవమానానికి గురైంది.

రెండు కుటుంబాల మధ్య వచ్చిన తగవు ఇంకా పెరిగి పెద్ద కలహంగా మారిపోకుండా, అది చాలా చిన్న విషయం అనే భావన కలిగేట్టు, అంతటితో తగవు సమసిపోయేట్టు తన పద్య రచనా ప్రతిభతో ప్రయత్నించమని 'కారిల్' అనే మిత్రుడు అలెగ్జాండర్ పోప్‌ని కోరాడు. అతను తగవు వచ్చిన రెండు కుటుంబాలతో మంచి స్నేహం,సన్నిహితత్వం వున్న మనిషి. అలెగ్జాండర్‌పోప్ కవిగా రంగంలోకి దిగి, రెండు కాథలిక్ కుటుంబాల మధ్య వచ్చిన వైరాన్ని పెద్ద భయంకర యుద్ధంగా చిత్రించారు. ఈ పద్యకావ్యంలో- అప్పటి కాలపు వ్యక్తుల ఆడంబరాన్ని, పటాటోపాన్ని, అహంభావాన్ని, వాస్తవ విరుద్ధమైన విలువల్ని అపహాస్యం చేస్తూ రాశారు.

గ్రీకు మహాకవి హోమర్ తన ప్రసిద్ధ పురాణ కావ్యంలో 'యకివిస్' అనే గ్రీకువీరుడు పాల్గొన్న ట్రాయ్ ప్రాంతపు యుద్ధాన్ని వర్ణించాడు. అదేస్థాయిలో వ్యంగ్యంగా పోప్ తన అధిక్షేప కావ్యాన్ని రాశాడు. ఎంతో సాధారణమైన తేలికపాటి అంశాన్ని పోప్ గ్రీకు కవి హోమర్‌ని అనుకరిస్తూ, గ్రీకు ఇతిహాస రీతిలో రాయడం వల్ల ఇది అసాధారణ రచనగా 'అధిక్షేప కావ్యం', 'మాక్ ఎపిక్'గా సాహితీ చరిత్రలో నిలిచిపోయింది.

- ఎం.డి.సౌజన్య

# నా గది

మనీ ప్లాంటును ధరించి
గాజుసీసా ప్రాణవంతమైంది
అద్దం ముఖాన్ని దాచుకొని
మళ్ళీ మళ్ళీ చూసుకుంటుంది
కవిత్వం పుస్తకాల్తో
టీపాయి ఊపిరి పోసుకుంది
చిన్నప్పటి ఫోటోలన్ని
బాల్యాన్ని దాటిపోకుండా
పట్టుకున్నాయి
ప్లాస్టిక్ పూలు
గదినంతా పరిమళంతో
సేదతీరుస్తున్నాయి
నా గది
మిత్రుడి రాకతో
సేద తీరింది.
నేనిప్పుడు వాల్‌పోస్టర్ లాన్లో
నిల్చున్నాను కృత్రిమంగా!

- బసలింగప్ప